# అపూర్వ

''మేడమ్! మీకోసం ఎవరో వచ్చారు'' జూనియర్ లాయర్ స్వాతి లోపలికి వచ్చి అన్నది.

ఆర్గ్యుమెంట్స్‌కి రాబోతున్న క్రిమినల్ కేసు తాలూకు ఫైల్ దానికి సంబంధించిన ఐ.పి.సి రిఫర్ చేయడంలో పూర్తిగా లీనమైన అపూర్వ, తపోభంగం కలిగిన దానిలా మెల్లగా చూసింది స్వాతి వైపు...

ఏ కేసైనా దాని పూర్వాపరాలు, పూర్తిగా పరిశీలించనిదే ఏ నిర్ణయం తీసుకోవటానికి ఇష్టపడదు అపూర్వ. ప్రతిరోజూ ఐ.పి.సి మొత్తం మరీ మరీ చూస్తూ ఉంటుంది. అలాగే ఆరోజు కూడా, మరునాడు ఆర్గ్యుమెంట్స్‌కి రాబోతూన్న రేప్‌కేసు తాలూకు ఫైల్‌ని సీరియస్‌గా చదువుతోంది. అలాంటి సమయాల్లో ఆమెని డిస్టర్బ్ చేయటానికి స్వాతికి అసలు ఇష్టం ఉండదు. కానీ వచ్చిన వ్యక్తిని చూస్తే చాలా పెద్దమనిషిలా ఉన్నాడు. మారుతీకారులో వచ్చాడు.

వస్తూనే 'అపూర్వ ఉందా' అంటూ అధికారికంగా ప్రశ్నించాడు. ''మీ పేరు?'' అని అడిగితే నిర్లక్ష్యంగా ''మధుసూదన్ అని చెప్పు'' అన్నాడు. అందుకే తప్పనిసరై డిస్టర్బ్ చేయాల్సివచ్చింది. అందుకే మరోసారి ఆవిడను పూర్తిగా డిస్టర్బ్ చేస్తూ ''మీకోసం మధుసూదన్ అట వచ్చారు'' అన్నది.

అపూర్వ కనుబొమలు ఓ అరక్షణం ముడిపడ్డాయి. అప్రయత్నంగా చేతిలో ఫైల్ సోఫాలో పెట్టి లేచింది. బైటికి నడవబోతూ ఓ క్షణం ఆగి అడిగింది స్వాతిని ''ఎలా ఉన్నాడు?''

''సఫారీ సూటు - పెద్ద పెద్ద మీసాలు - కళ్ళద్దాలు - చూపుల్లో చాలా కరుకుదనం ఉంది. ఆయనని చూస్తే పొలిటికల్ లీడర్‌లా ఉన్నాడు' అన్నది స్వాతి.

అపూర్వ క్రింది పెదవి కొరుక్కుంటూ రెండు నిమిషాలు ఆలోచనగా ఉండిపోయింది. తరువాత చెరిగిన జుట్టును సరిచేసుకుంటూ ''నువ్విక్కడే ఉండు'' స్వాతితో అంటూ బైటికి నడిచింది...

మడత నలగని హ్యాండ్లూమ్ చీరలో హుందాగా వచ్చిన అపూర్వను చూస్తూనే వచ్చిన వ్యక్తి కళ్ళు మెరిశాయి.

అపూర్వ అతడిని చూసి పల్చగా నవ్వి అన్నది.

''దారితప్పి వచ్చినట్టున్నారు - ఎక్స్ ఎమ్మెల్యే గారు.''

''నీతో పని ఉండి వచ్చాను.''

''పని లేకుండా, కాలక్షేపం కోసం వచ్చే వయసు కాదుకదా!'' నవ్వుతూ సోఫాలో కూర్చుంది.

''నువ్వు ఏం మారలేదు'' అన్నాడతను.

''ఏ విధమైన మార్పు ఆశిస్తున్నారు నాలో-''

''ఇదే! ఈ తర్కించే స్వభావం - ఎప్పుడూ దేనికీ ఎదురు ప్రశ్న లేకుండా సమాధానం ఇవ్వని నీ తత్వం.''

''పుట్టుకతో వచ్చిన బుద్ధికదండీ. చివరిదాకా పోదు.''

అతణ్ణి చూస్తోంటే - ఇరవై యేళ్ళ క్రితం జరిగిన సంఘటన - అతను తనని అవమానించిన తీరు - కళ్ళముందు మళ్ళీ సినిమా రీలులా తిరుగుతోంది.

అతను ఇన్నేళ్ళ తరువాత సిగ్గులేకుండా తన దగ్గరికి ఎందుకు వచ్చాడో బాగా తెలుసు.

హిపోక్రసీ ముసుగు వేసుకుని, అన్యాయంగా ఆర్జించిన సొమ్ముతో భోగభాగ్యాల్లో మునిగితేలుతూ మంచివాడు, చదువుకున్నవాడు, సంస్కారి అనే బిరుదులతో ఈ సంఘంలో గుర్తింపు పొందిన ఓ ఘరానా పెద్దమనిషి. ఈ ఘరానా పెద్దమనిషి పరువు, ప్రతిష్ఠ, హోదా, అంతస్థు... అన్నీ రేపు కోర్టులో తన ముందుకు ఆర్గ్యుమెంట్స్‌కి రాబోతోన్న కేసు మీద ఆధారపడి ఉన్నాయి.

ఓ అమాయకురాలు, నిస్సహాయురాలైన ఆడపిల్లని అమానుషంగా రేప్ చేసి రోడ్డు ప్రక్కన ఆ పిల్లని అపస్మారక స్థితిలో పడేసి వెళ్ళిపోయిన ఓ నీచుడికి తండ్రిగా - తన పరపతిని, ఆస్తిని, అంతస్థునీ ఎరగా చూపి

రక్షించుకోటానికి వచ్చాడు.

హు... పె.. ద్ద.. మ.. ని.. షి...

''అపూర్వా!'' అతని కంఠం గంభీరంగా ధ్వనించింది.

అపూర్వ తన మనసులో చెలరేగుతున్న సంఘర్షణనణచుకుంటూ అతనివైపు చూసింది...

ఇరవైయేళ్ళ క్రితం నిస్సహాయస్థితిలో తన స్నేహితుడు, ఆత్మీయుడు కలిసి చదువుకున్న వాడు, మంచివాడు అని ఓ సహాయాన్ని అర్థించటానికి వెళ్ళితే...

తన అంతస్థుకీ, గొప్పతనానికీ, తనకి సాయం చేయటం కళంకాన్ని ఆపాదిస్తుందని భయపడి, కాదు - తనని భయపెట్టి... అవమానించి పంపాడు.

యూనివర్శిటీలో మధుసూదన్, అపూర్వ కలిసి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశారు. అనుకోకుండా ఇద్దరి మధ్యా మంచి స్నేహం కుదిరింది.

ఇద్దరూ తెలివైన వాళ్లవటం - ఇద్దరిదీ ఒకే గ్రూప్ కావడం - అపూర్వమైన అపూర్వ వ్యక్తిత్వం - అందమైన అతని చిరునవ్వు వాళ్ళిద్దరినీ కలిపింది.

చాలామంది తోటి విద్యార్థులు వీరి చనువునీ, స్నేహాన్ని అపార్థం చేసుకున్నారు - అసూయ పడ్డారు.

అయినా వాళ్ళు లక్ష్యపెట్టలేదు. దాదాపు రెండేళ్ళు చాలా మంచి స్నేహితులుగా ఉంటూ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

మధుసూదన్ తల్లి బాగా చదువుకున్నావిడే. తండ్రి కూడా బిజినెస్ మాగ్నెట్, కోటీశ్వర్లు వాళ్ళు. అతని అన్నలు కూడా మంచి పొజిషన్‌లోనే ఉండేవాళ్ళు... తన కుటుంబం విద్యావంతుల కుటుంబం, కలిమి గల కుటుంబం అన్న అహం అతనిలో చాలాసార్లు గమనించింది అపూర్వ. కానీ ఆ అహం - తమ మధ్య మంచి స్నేహానికి అంత అవరోధంగా భావించలేదు.

అపూర్వ చాలా సాధారణ కుటుంబంలోని అమ్మాయి. కష్టపడి చదివేది. అతనిలో పరోపకార గుణం లేకపోవడం కనిపెట్టి ఎంత ఇబ్బందిపడ్డా తన సమస్యలు అతనికి చెప్పేది కాదు.

అతనికి నలుగురైదుగురు అమ్మాయిలతో కూడా స్నేహం ఉండేది. అలాంటి స్నేహాన్ని మాత్రం తననించి కోరే అవకాశం అపూర్వ కలగనివ్వలేదు

అతనికి.

ఆ తరువాత మదుసూదన్ ఎం.బి.ఎ చదవటానికి వెళ్ళిపోయాడు.

'లా' చదవాలన్న కోరికకు ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోడంతో ఆ కోరికకు మనసులోనే సమాధికట్టి తల్లితండ్రులు కుదిర్చిన సంబంధం ఒప్పుకుని పెళ్ళి చేసుకుంది అపూర్వ.

ఆమె మనసులో మధుసూదన్ పట్ల ఓ ఆకర్షణ అలాగే ఉండిపోయింది. ఎన్నడూ తన భావం బైటపెట్టే ప్రయత్నం చేయలేదు. కారణం అతనికీ - తనకీ మధ్య అంతస్తుల తేడా, భూమికీ, ఆకాశానికీ ఉన్నంత అన్న విషయం తెలుసు ఆమెకి.

దురదృష్టవశాత్తూ అపూర్వ వైవాహిక జీవితం దారుణంగా ఫెయిల్ అయింది. కట్నం ఇవ్వలేని తల్లితండ్రుల దౌర్భాగ్యానికి, డబ్బు దాహంతో తపించిపోయే భర్తకీ పొత్తు కుదరలేదు. ఓనాడు కట్నం లేకుండా తనింటికి రావద్దని మెడపట్టి బైటికి గెంటేసిన భర్తనుంచి శాశ్వతంగా సెలవు తీసుకుని పుట్టింటికి చేరింది...

అపూర్వ కారెక్టరు మంచిది కాదంటూ దొంగ సాక్ష్యాలు సృష్టించి డైవోర్స్ తీసుకున్నాడు ఆమె భర్త.

ఆర్థిక సమస్యలు... సాంఘిక సమస్యలు తీవ్రంగా బాధిస్తూంటే అపూర్వ తనకు తెలిసిన ప్రతిచోటా ఉద్యోగం కోసం ప్రయత్నించింది. రెండు, మూడు చిన్నచిన్న ప్రైవేటు కంపెనీల్లో కొన్నాళ్ళు చేయడం, ఆ ఆఫీసర్ల ప్రవర్తన నచ్చక రిజైన్ చేయడం, చుట్టుపక్కల వాళ్ళ సూటీపోటీ మాటలు వినడం ఈ దిక్కుమాలిన సమాజంలో భర్తచేత త్యజించబడిన స్త్రీలందరికీ ఎంత సహజమో ఆమెకీ అంతే సహజం అయింది.

అనుకోకుండా ఓనాడు తన స్నేహితుడు మధుసూదన్ ఓ పెద్ద కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్ అయ్యాడన్న విషయం తెలిసి అతని వద్దకు ఉద్యోగం కోసం వెళ్ళింది.

అపూర్వకి ఆనాటి సంఘటన మనసులో మెదిలింది. అద్భుతమైన ఆ బిల్డింగ్ గేటులోకి అడుగుపెట్టబోతూన్న అపూర్వ కాళ్ళు ఓ క్షణం తడబడ్డాయి. గుండె ఓ క్షణం వేగంగా కొట్టుకుంది...

దాదాపు మూడేళ్ళ తరువాత తన ప్రాణమిత్రుణ్ణి కలుసుకోబోతోంది.

ఆ అందమైన చిరునవ్వు మరోసారి చూడబోతోంది..

పెళ్లై ఏపోయి ఉంటుంది.

విద్యార్థిగా తనం చూసిన మధుని ఈనాడు పెద్ద హోదాలో చూడబోతోంది...

చూడగానే ఆనందంగా పలకరిస్తాడో, గుర్తుపట్టనట్లు ఆలోచిస్తాడో... లేదు లేదు మధులో అహం ఉండచ్చుగాక... తన విషయంలో అది ఎప్పుడూ ప్రదర్శించడు.

ఆలోచిస్తూనే హాల్లోకి నడిచి వచ్చింది. వాచ్‌మెన్ ఆమెవైపు ఓ క్షణం విచిత్రంగా చూసి నౌఖర్‌ని పిల్చాడు. నౌఖరు రాగానే చిన్న స్లిప్ మీద ''అపూర్వ'' అని వ్రాసి పంపించింది.

శరీరం అంతా చిత్రమైన స్పందనతో నిండి పోయింది. తనని తాను కంట్రోల్ చేసుకోడానికి గాను సోఫాలో కూర్చుని రెండుచేతులూ నలుపుకో సాగింది.

పది నిమిషాల భయంకరమైన నిరీక్షణానంతరం నౌఖరు వచ్చి లోపలికి వెళ్ళమన్నాడు.

మొగలిపూల సౌరభంతో నిండిన పెర్‌ఫ్యూమ్‌డ్ ఎ.సి. ఛాంబర్‌లో సింహాసనంలాంటి కుర్చీలో ఠీవిగా మధు...

అపూర్వ అప్రయత్నంగా చేతులు జోడించింది.

''కూర్చో! బాగున్నావా!'' అడిగాడు మధు.

అతని కంఠంలో ఆనాటి అప్యాయతగానీ, అల్లరిగానీ ఏమీ లేదు. మామూలుగా... చాలా మామూలుగా పరాయివాళ్ళనెవరినో పలకరించినట్టు పలకరించాడు.

అపూర్వ తల ఊపింది.

''మీవారెలా ఉన్నారు?''

అపూర్వ మాట్లాడలేదు. తలవంచుకుని చేతి వ్రేళ్ళ గోళ్ళు పరిశీలించసాగింది.

''కాఫీ తాగుతావా?''

లేదన్నట్టు తలాడించింది. ఎంతో ఆశతో, కొండంత నమ్మకంతో వచ్చింది. అతని ధోరణి నిరుత్సాహాన్నే కాదు - దుఃఖాన్ని కూడా కలుగచేస్తోంది.

చాలాసేపు మౌనం రాజ్యం చేసింది ఇద్దరి మధ్యా.

ఎలాగో గొంతు పెగుల్చుకుని... ''మధూ!'' అన్నది.

''చెప్పు...'' క్లుప్తంగా అన్నాడు.

''మధూ! నేను... నేను జీవితంలో ఓడిపోయాను. ఒంటరిగా మిగిలిపోయాను... నాకు... నాకు ఏదన్నా జాబ్ కావాలి.''

మధుసూదన్ మాట్లాడలేదు.

అతని సమాధానంకోసం గుండె చిక్కపట్టుకుని ఎదురుచూడసాగింది...

నెమ్మదిగా అన్నాడు. ''అపూర్వా! కాలేజీ రోజుల్లో ఏదో మనం స్నేహంగా ఉన్నాం. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. నీ గురించి నాకు ఇద్దరు, ముగ్గురు చెప్పారు... నీ భర్త నిన్నెందుకు వదిలేశాడని నేను అడగటం లేదు. కానీ నేను నీకు ఉద్యోగం ఇచ్చి, అదీ నా ఆఫీసులో... ఆదుకునే పరిస్థితుల్లో లేను. కావాలంటే నీక్కొంత ఆర్థికసాయం చేయగలను.''

అపూర్వ తీక్షణంగా చూసింది.

''పరిస్థితులు కాదు మధూ! మారింది నువ్వు - నువ్వు మారిపోయావు. ఏం విన్నావు మధూ! నా గురించి - ఎవరిద్వారా విన్నావు? నీ అంతస్తు ముందు నేనంత అల్పురాలిగా కనిపిస్తున్నానా?'' దుఃఖంతో తడబడుతున్న స్వరంతో అడిగింది.

''అయామ్ సారీ! అపూర్వా! నిన్ను బాధపెట్టాలని అనలేదు. నీకు తెలుసనుకుంటా. నా భార్య కలెక్టరు... నేను విద్యార్థిగా ఉన్నప్పుడు అల్లరి చిల్లరగా తిరిగి అమ్మాయిలతో స్నేహం చేసినా అది సహజంగా ఉండేది. కాని ఇప్పుడు ఒక కంపెనీకి మేనేజింగ్ డైరెక్టరుగా, ఓ కలెక్టరు గారి భర్తగా ఒక స్టేటస్ మెయిన్‌టేన్ చేయాల్సిన బాధ్యత నామీద ఉంది. నీలాంటి భర్త వదిలేసిన స్త్రీకి ఉన్నపళంగా ఉద్యోగం ఇచ్చి, అందులోనూ గతంలో మనం స్నేహితులంకూడాను... నా ఆఫీసులో పెట్టుకుంటే పది మంది విమర్శలకు గురికావాల్సి ఉంటుంది. అది నీక్కానీ, నాక్కానీ అంత మంచిది కాదు. పైగా నీకంత మంచి పేరు లేదు... అయినా నీ వ్యక్తిగత జీవితం గురించి నేను మాట్లాడకూడదనుకో!''

''ప్లీజ్ స్టాపిట్!'' గట్టిగా అరిచింది అపూర్వ.

''అవును... నాకు మంచిపేరు లేదు. ఎందుకంటే నా దగ్గర డబ్బు

లేదు... హోదా లేదు... కుంటివాడో, గుడ్డివాడో, త్రాగుబోతో, తిరుగుబోతో భర్త లేడు. ఉన్నది ఒక్కటే ఎవరికీ కనిపించని... ఎవరికీ అక్కర్లేని ఆత్మవిశ్వాసం... ఆత్మగౌరవం... నేను బ్రతకటానికి ఈ రెండూ చాలు... నాకు ఉద్యోగం ఇస్తే నీకు చెడ్డపేరు వస్తుంది. ఎందుకు వస్తుంది? నువ్వు పెళ్ళికాక ముందు చిల్లరగా తిరిగావు కాబట్టి... కానీ నీకూ, నాకూ మధ్య అలాంటి చిల్లర స్నేహం లేదు! మరి ఎందుకీ ఉలికిపాటు?

మధూ! నీ నీడను చూసి నువ్వు ఉలిక్కిపడుతున్నావు. నీ భార్య కలెక్టరు... మీ అమ్మా, నాన్నా గొప్ప హోదాలో ఉన్నారన్న అహం ఎంత ఉండేదో ఆనాడు - ఈనాడు నీ భార్య కలెక్టరు అన్న అహం కూడా నీలో ఉంది... నువ్వు నీ వ్యక్తిత్వానికి కాక ఇతరుల వ్యక్తిత్వానికి విలువ ఇస్తున్నావు... అందుకే నాకు సాయం చేయడం నీకు తలవంపులుగా భావిస్తున్నావు. హేట్సాఫ్ మిస్టర్ మధూ! జాగ్రత్తగా పదిలంగా నీ హోదానీ, నీ భార్య హోదానీ, నీ ఆస్తినీ, అంతస్థునీ కాపాడుకో! నువ్వంటే నాకేమిటో ఆలస్యంగానైనా, పూర్తిగా తెలిసింది... నాకీ అవకాశం ఇచ్చిన భగవంతుడికి నేను సదా కృతజ్ఞురాలిని... గుడ్‌బై...''

అపూర్వ విసురుగా వచ్చేసింది...

''నువ్వు నా మాటలు వినాలనుకోడం లేదా?''

అపూర్వ ఉలిక్కిపడింది... చెంపల మీద జారిన కన్నీరు తుడుచుకుని... ''చెప్పు'' అన్నది.

''మావాడు చిన్నవాడు... ఏదో ఉడుకురక్తంలో చిన్నతప్పు చేశాడు. ఆ పిల్లకి అడిగినంత డబ్బిస్తాను. కేసు క్లోజ్ చేయాలి...''

అపూర్వ నవ్వింది...

''మధుసూదన్‌గారూ! మీ డబ్బుతో మీరు అంతస్థుని కొనుక్కోగలిగారు... ఎమ్ ఎల్ ఏ పదవిని కొనుక్కోగలిగారు... ఎన్నో బిల్డింగ్‌లూ, స్థలాలు, పొలాలు కొనుక్కోగలిగారు... కానీ ఓ ఆడపిల్ల జీవితం కొనడం అంత ఈజీ కాదు.''

''చూడూ! అదంతా నాకు తెలీదు... నువ్వు కూడా బాగా కష్టపడి పైకొచ్చినదానివి... మహిళా కోర్టులో జడ్జీగా ఐదారేళ్ళనుంచీ నువ్వు డీల్ చేస్తోన్న కేసులు విన్నాను... నీ వ్యక్తిత్వం - ధైర్యం నాకు బాగా తెలుసు...

కానీ నీ స్నేహితుణ్ణిగా కాక ఓ ఎమ్ ఎల్ ఏగా అడుగుతున్నాను... కేసు క్లోజ్ చేయాలంటే నీకెంత కావాలో చెప్పు.''

''హుఁ! నా వ్యక్తిత్వం గురించి తెలుసన్నారు... ఏం తెలుసు? డబ్బు తీసుకుని అన్యాయాన్ని న్యాయంగా, తప్పుని ఒప్పుగా తిరిగి రాస్తానని తెలుసుకున్నారా? మీరిప్పుడు కేవలం ఎక్స్ ఎమ్.ఎల్.ఏ అన్న విషయం మర్చిపోకండి... నేను ఆడదాన్ని ఓ ఆడదానిగా.... అందులోనూ జీవితంలో దగాపడిన ఆడదానిగా ఆడదాని కష్టాలు... కన్నీళ్ళు బాగా తెలుసు.

ఆడదాని జీవితంతో పరోక్షంగాకానీ, ప్రత్యక్షంగాకానీ ఆడుకున్న ఏ మగవాణ్ణి నేను క్షమించను. మీరు ఎమ్.ఎల్.ఏ ఐనా, ప్రైమ్ మినిస్టర్ అయినా న్యాయాన్ని నమ్మినదాన్ని....న్యాయమూర్తిని... డబ్బుకి కక్కుర్తి పడి ప్రవర్తిస్తానని కల్లో కూడా అనుకోకండి. ఇంకా మీలో అహం చావనందుకు బాధగా ఉంది.''

''పగ తీర్చుకుంటున్నావా'' తీక్షణంగా అడిగాడు.

''ఎందుకు పగ? మీరేం చేశారని? ఉద్యోగం అడిగితే ఇవ్వనన్నారు... ముష్టిదానికేసినట్టు దానం పడేస్తానన్నారు. నేనేగా మీ దానాన్ని తిరస్కరించాను... మీరేం అన్నారు... సంస్కారం లేని మనుషులంతా అన్నదాన్నే మీరు కొంచెం నాగరికత రంగు పూసి అన్నారు. అందరిలాగే మీరూ నామీద అనుమానపు, అపనిందల తాలూకు బాణాలు వేశారు... అవి నా గుండెల్లో గుచ్చుకుని, గాయాలై రక్తం ఓడి... ఆ రక్తం కన్నీటి రూపంలో నా కళ్ళ నుండి స్రవిస్తోంటే అందరిలాగే మీరూ ఆనందించారు... మీరేం చేశారని నాకు పగ... మధుసూదన్‌గారూ! ఇక్కడ పగ ప్రసక్తి లేదండీ... కేవలం నా కర్తవ్యాన్ని నేను మీకు గుర్తు చేస్తున్నాను...

కేసు పూర్వాపరాలు పరిశీలించాను... ఆడపిల్ల కన్నీటి కథ విన్నాను... సాక్ష్యాలు సేకరించాను... అన్నీ నాకు తప్పు మీ అబ్బాయిది మాత్రమే అని తెలియచేస్తున్నాయి... అలాంటప్పుడు ఆ అబ్బాయిది తప్పు కాదని ఎలా అనగలను? పోనీ ఆ అమ్మాయిని మీ కోడలిగా స్వీకరిస్తారా చెప్పండి.''

''జాగ్రత్తగా మాట్లాడు అపూర్వా! నేను తలచుకుంటే ఏమైనా చేయగలను- బజారుదాన్ని నా కోడలిగా చేసుకోవాలా?''

''బజారుది... ఎవరండీ బజారుది - తనమానాన తను... పొట్టచేత

పట్టుకుని ఉద్యోగం చేసుకుని ఇంటికి వెళుతోన్న ఓ అబలని బజారులో పట్టుకొని బజారు మనిషికన్నా హీనంగా అనుభవించి, బజారులో వదిలేసిన మీ అబ్బాయి బజారు మనిషి... మీరు లక్షాధికారులైనా, కోటీశ్వరులైనా బజారుపని చేసిన వాళ్ళు బజారు మనుషులవుతారు... ఆ అమ్మాయి ఎలా అవుతుంది? ఇకపోతే మీరేమైనా చేయగలరా? చేయండి చూస్తాను. ఏం చేయగలరండీ మీరు? నన్ను కానీ, ఆ అమ్మాయిని కానీ హత్య చేయించగలరు? అంతేగా? అంతకన్నా ఏం చేయగలరు?

మధుసూదన్‌గారూ! జీవితం అంటే కేవలం డబ్బు, హోదా, అంతస్థు... ఎ.సి. మేడలు... పర్‌ఫ్యూమ్‌లే కాదండీ... ఆత్మాభిమానం, అనురాగం, కరుణ, పరోపకారం... ఆత్మవిశ్వాసం - పాపభీతి, దైవభక్తి ఇవి కూడా జీవితంలో ప్రతి మనిషికీ ఉండాల్సిన లక్షణాలు. వెళ్ళండి... దయచేసి ఇక్కడ్నించి వెళ్ళిపొండి.

మీరు ఈ కేసు గురించి ఏదన్నా మాట్లాడదల్చుకుంటే రేపు కోర్టుకి రండి... మీ హోదాతో గానీ, మీ భార్య హోదాతోకానీ నా తీర్పుని కొనలేరు... మరోసారి వినండి... మీ డబ్బు చూసి ఆశపడే హీనస్థితికి అపూర్వ దిగజారలేదు... ఎన్నటికీ దిగజారదు...

ఇంకొక విషయం గుర్తుంచుకోండి. మగవాడు సాంఘికంగా ఎదుగుతున్నకొద్దీ, నైతికంగా దిగజారుతుంటాడు. ఆడది నైతికంగా ఎదగడానికే సాంఘిక హోదా కోరుకుంటుంది. ఈ సమాజంలో ఆడదానికి రెండే విధాలుగా గౌరవం లభిస్తుందని తెలుసుకున్నాను. ఒకటి అంతస్తు, హోదా, పరపతి ఉన్న వ్యక్తికి భార్యగా, రెండు స్వంతంగా తనకో అంతస్తు, హోదా కల్పించుకున్న స్త్రీగా. రెండో మార్గం అనుసరించి ఈనాడీ స్థితికి వచ్చానంటే కేవలం నా నీతి, నిజాయితీ నిరూపించుకోడానికే...''

అపూర్వ విసురుగా ఈ మాటలనేసి లోపలికి వెళ్ళిపోయింది. తను పదిలంగా కాపాడుకున్న పరువు, ప్రతిష్ఠ అపూర్వ వ్యక్తిత్వం క్రింద నలిగిపోతోంటే నిరుత్తరుడిలా చూస్తూ నిల్చుండి పోయాడు మధుసూదన్.

ఈనాడు ఆదివారం అనుబంధం